



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క- సారలమ్మల దేవస్థానంలో ఆదివారం భక్తుల కోలాహలం కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తుల మేడారంలోని సమ్మక్క-సారలమ్మల దేవస్థానానికి తరలివచ్చి తల్లుల గద్దెలకు పూజలు చేశారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె కొబ్బరికాయలు, ఎత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణంలో గంటల పాటు సేద తీరుతూ కోరిన కోరికలు తీరాలని తల్లులను వేడుకున్నారు. అనంతరం దేవస్థానం సమీపంలోని దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేస్తూ సందడి చేశారు. పరిసరాల్లోని చెట్ల కింద బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు.



వాగు నుంచి శవాన్ని తీస్తున్న ఈతగాళ్లు



అభిషేక్ (ఫైల్)

ఈతకు వెళ్లి యువకుడి మృతి

- స్నేహితుల దినోత్సవంలో విషాదం
- మంగపేట మండలం బుచ్చంపేటలో ఘటన

మంగపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన యువకడు మృతి చెందాడు. వాగులో నీటమునిగి ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలంలోని బుచ్చంపేటకు చెందిన బూర్గుల రమేష్- మణేమ్మ దంపతుల కుమారుడు బూర్గుల అభిషేక్ (25) డిగ్రీ వరకు చదివాడు. తల్లి మృతి చెందగా తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే కావడంతో తోటి మిత్రులతో కలిసి గ్రామానికి ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న గౌరారం వాగులో ఈతకు వెళ్లాడు. వాగు లోతును గమనించక లోపలికి వెళ్లి నీటమునిగి గల్లంతయ్యాడు. దీంతో అక్కడే ఉన్న మిత్రులు ఆందోళన చెంది వెతికారు. అయినప్పటికీ జాడ దొరకపోవడంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పలువురు గ్రామస్థులు, ఈతగాళ్లు లోతైన మడుగులో వెతికగా అభిషేక్ మృతదేహం లభ్యమైంది.

సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అభిషేక్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడు అభిషేక్‌కు అన్నతోపాటు చెల్లి ఉంది. చేతికందిన కుమారుడు వాగులో మునిగి చనిపోవడంతో తండ్రి రోదనలు మిన్నంటాయి.



అభివృద్ధి వైపు అడుగులు

భూపాలపల్లి జిల్లాలో బైపాస్ రోడ్డు నిర్మాణం

- రూ. 500 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మహర్దశ
- గూడెప్పాడ్ నుంచి చెల్పూర్ వరకు జాతీయ రహదారికి రూ. 600 కోట్లు
- మూడేళ్లల్లో పూర్తయ్యేలా అధికారుల కసరత్తు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాకు మహర్దశ పట్టనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషితో అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. రానున్న రోజుల్లో జిల్లా రూపురేఖలు మారనున్నాయి. దశాబ్ద కాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నారు. భూపాలపల్లి మీదుగా వెళ్తున్న భారీ వాహనాలతో ఇబ్బందులు పడుతున్న పట్టణ వాసుల కష్టాలు ఇక కడతేరనున్నాయి. దాదాపు 23 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణం రూ. 500 కోట్లతో జరగనుండగా దీని పూర్తి ఖర్చును కేంద్ర రోడ్డు రవాణా శాఖ భరించనుంది. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను వచ్చే నెలలో ఖరారు చేసి టెండర్లను ఆహ్వానించనున్నారు. దీంతోపాటు గూడెప్పాడ్ నుంచి చెల్పూర్ వరకు 44 కిలోమీటర్ల నాలుగు వరుసల రోడ్డు నిర్మాణాన్ని కూడా రూ. 600 కోట్లతో చేపట్టనున్నారు. రానున్న మూడేళ్లల్లో ఈ రెండు రోడ్లను పూర్తి చేయాలని లక్ష్యం ఉండగా ఇందుకు అధికారులు కసరత్తును ప్రారంభించారు.

పట్టణ ప్రజల్లో హర్షం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా 2016లో ఆవిర్భవించింది. సింగరేణి, జెన్‌కోతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లి ప్రాంతం జిల్లా కేంద్రంగా ఏర్పడింది. దీంతో అభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. సమీకృత కలెక్టరేట్, మెడికల్ కాలేజీ వంటి ప్రతిష్ఠాత్మక నిర్మాణాల తర్వాత భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు కూడా మంజూరు కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. భూపాలపల్లి ప్రాంతం మీదుగా నిత్యం వందలాది ఇసుక, బొగ్గు లారీలు ప్రయాణిస్తుంటాయి. వీటితోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌కు జిల్లా సరిహద్దు కావడంతో ఆయా రాష్ట్రాలకు జిల్లా మీదుగా పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో భూపాలపల్లి పట్టణ వాసులతోపాటు జిల్లా కేంద్రానికి పనుల నిమిత్తం వచ్చే వారు కూడా ఇబ్బందులు పడతున్నారు. పెద్దసంఖ్యలో ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ఈ సమస్యలన్నంటికీ పరిష్కారంగా భూపాలపల్లి పట్టణం మీదుగా దాదాపు 23 కిలోమీటర్ల బైపాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 500 కోట్ల వ్యయం

భూపాలపల్లి పట్టణానికి దశాబ్ద కాలంగా బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండు వినిపిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బైపాస్ రోడ్డు నిర్మాణం తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో భూపాలపల్లి పట్టణాన్ని ఆనుకొని ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ప్రభుత్వం మారడంతో ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఈ ప్రతిపాదనను ముందుకు నడిపారు. కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో గడ్కరీ సుముఖం వ్యక్తం చేయడంతో బైపాస్ రోడ్డు నిర్మాణం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. నేషనల్ హైవే ఆధ్వరంలో బైపాస్ నిర్మాణం చేపట్టాలని కేంద్రం నిర్ణయిం తీసుకుంది. దాదాపు 23 కిలోమీటర్ల మేర బైపాస్ నిర్మాణం చేపట్టనున్నట్లు సమాచారం. ఇన్నాళ్లు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న బైపాస్ అంశం నేషనల్ హైవే అధికారుల చేతుల్లోకి పోవడంతో వారు వచ్చే నెలలో డీపీఆర్‌ను తయారు చేసి టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. బైపాస్ నిర్మాణానికి భూసేకరణతో పాటు రూ. 500కోట్లకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉందని నేషనల్‌హైవే అధికార వర్గాలు తెలిపాయి. ఈ నిధులతోనే డీపీఆర్, నిర్మాణం, (మిగతా 8వ పేజీలో)





గతంలో కాగితాలకే పరిమితం

భూపాలపల్లి అభివృద్ధికి బైపాస్ రోడ్డు నిర్మాణం మరింత దోహదపడునుంది. ఈ ప్రతిపాదనను గత పాలకులు కాగితాలకే పరిమితం చేశారు. మా ప్రభుత్వం రాగానే బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఒప్పించాం. దీంతో రూ. 500 కోట్లతో బైపాస్ రోడ్డును మంజూరు చేశారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేసి టెండర్లు పిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒత్తిడి తెస్తున్నాం. మూడేళ్లల్లో ఈ రోడ్డు అందుబాటులోకి రానుంది.

- గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే

నేడు కాళేశ్వరానికి బీఆర్‌ఎస్ నేతల రాక

కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శన

మహదేవపూర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు సోమవారం సందర్శించనున్నారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్యేలు కోరికంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, వొడితెల సతీష్ బాబు, సుంకె రవి శంకర్, భూపాలపల్లి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చైర్మన్ జక్కు శ్రీహర్షిణి పర్యటించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి స్థితిగతులను పరిశీలించనున్నట్టు తెలుస్తోంది. అనంతరం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మాట్లాడతారని సమాచారం.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతన్న ప్రవాహం

1.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం బ్యారేజీలోకి 1.40లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నట్లు అధికారులు చెప్పారు. బ్యారేజీ వద్ద గోదావరి 2.6 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు తెలిపారు.

అక్షరమే ఆలంబన

- మహిళలకు 'ఓపెన్' చదువులు
- స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవకాశం
- నిరక్షరాస్యతను తొలగించడమే లక్ష్యంగా ముందడుగు



వెంకటాపూర్, ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి): మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు ముందడుగు వేశారు. విద్యా శాఖ, వయోజన విద్య, ఐకేపీ ఆధ్వర్యంలో సంయుక్తంగా కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళల్లో అక్షర చైతన్యం నింపుతున్నారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్)లో చేర్పించి అక్షరాస్యులుగా మార్చే కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ కారణాలతో చదువుకోలేకపోయిన, మధ్యలో చదువు మానేసి వారిని ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతున్నారు.

జిల్లాలో 25513 మంది నిరక్షరాస్యులు

ములుగు జిల్లాలో 7,215 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 71,783 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఐకేపీ అధికారులు, సీసీలు, వీవోఏలు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నిరక్షరాస్యులను గుర్తించారు. చదువుకోలేని వారు జిల్లాలో 25,513 మంది ఉన్నట్టు అంచనాకు వచ్చారు. వీరిలో ఇప్పటి వరకు ఓపెన్ స్కూల్లో చదివించడానికి 2,370 మందిని ఎంపిక చేశారు. పదో తరగతిలో చేర్పించడానికి 960 మందిని, ఇంటర్‌లో చేర్పించడానికి 1410 మందిని ఎంచుకున్నారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ముందడగు వేశారు.

వలంటీర్లతో విద్యాబోధన

చదువు నేర్పించడానికి ఎలాంటి పారితోషికం ఆశించకుండా విద్యాబోధన అందించడానికి స్వచ్ఛందంగా పని చేయడానికి సూమారు 750 మంది వలంటీర్లు అవసరంఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం 745మంది ముందుకొచ్చినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉపాధ్యాయులు, ఉన్నత విద్యా సంస్థల విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు వలంటీర్లుగా పనిచేసే అవకాశం ఉంది.

విద్యా ప్రాధాన్యాన్ని వివరిస్తున్నాం



నిరక్షరాస్యులైన మహిళలకు విద్యా ప్రాధాన్యాన్ని వివరిస్తున్నాం. వారిని ఓపెన్ టెన్త్ తరగతి, ఇంటర్‌లో చేర్పించడానికి ఆయా మహిళా సంఘాల సీసీలు, వీవోఏల ద్వారా ప్రోత్సహిస్తున్నాం. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నాం.

- దురిశెట్టి చంద్రకళ, ములుగు డీఈఓ

నిరుపేదలకు వరం.. సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల పాలిట సీఎం సహాయ నిధి వరంగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన నిరుపేదలకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన ఆదివారం అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని, ఆపద సమయంలో ఆదుకుంటుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సామాన్యుడి పక్షాన ప్రజా ప్రభుత్వం నిలుస్తోందని అన్నారు. అలాగే భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు (మిగతా 8వ పేజీలో)



భూపాలపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే..

ములుగు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని జిల్లా ఎస్పీ శబరీశ్ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెలలో 456 డ్రంకెన్ డ్రైవ్ కేసులు జిల్లా వ్యాప్తంగా నమోదైనట్టు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో గడిచిన వారంలో 17 మంది మందుబాబులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని పేర్కొన్నారు. కోర్టులో హాజరు పరిచి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధించినట్లు తెలిపారు.



ఈతకొలనులో జలకాలాడుతున్న పర్యాటకులు

బొగత వద్ద కోలాహలం

తెలంగాణ నయాగరా బొగత జలపాతం ఆదివారం జనసంద్రమైంది. వారాంతపు సెలవు కావడంతో సందర్శకులు భారీగా తరలివచ్చారు. జలపాతం పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. హైదరబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, భద్రాచలం, ములుగు, జనగాం తదితర పట్టణాల నుంచి సందర్శకులు తరలివచ్చి జలపాతం అందాలను వీక్షించి మురిసిపోయారు. జలపాతం వద్ద ఉన్న ఈత కొలను జలకాలాడుతూ సందడి చేశారు. 3వేల మందికి పైగా సందర్శకులు వచ్చారు. ఈ ఏడాది ఇంత భారీ స్థాయిలో పర్యాటకులు తరలిరావడం ఇదే ప్రథమం. పర్యాటకుల వాహనాలతో పార్కింగ్ ప్రదేశం నిండిపోయింది.

- వాజేడు, (ఆంధ్రజ్యోతి)

ముడుపుగల్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ

- అమ్మవారి 2.5 గ్రాముల బంగారు మంగళసూత్రం అపహరణ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ చైర్మన్ యాస రమావెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఆలయాన్ని వాచ్‌మెన్ తెరిచి శుభ్రం చేసేందుకు వెళ్లాడు. గుడికి వేసిన తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన వాచ్‌మెన్ ఆలయ కమిటీకి సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న కమిటీ సభ్యులు చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆలయంలో అమ్మవారి మెడలోని మంగళసూత్రంను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు చెప్పారు. అమ్మవారి బంగారు మంగళసూత్రం 2 తులాల 5 గ్రాములు ఉంటుందని సుమారు దాని విలువ రూ.2.50 లక్షలు ఉంటుందన్నారు. ఈ ఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చైర్మన్ యాస వెంకట్‌రెడ్డి తెలిపారు

ఇందిరమ్మ ఇల్లు కావాలి

- టెలిఫోన్ టవర్ ఎక్కిన వ్యక్తి



తానంచర్లలో టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న రాములు

మరిపెడ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ గృహం కావాలంటూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని తానంచర్లలో ఓ నిరుపేద, కరుడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్త బాచినపల్లి రాములు ఆదివారం టెలిఫోన్ టవర్(110 మీటర్లు ఎత్తులో) ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటల పాటు టెలిఫోన్ టవర్ పైకెక్కాడు. స్థానికులు తెలుసుకుని పోలీసుకు సమాచారమిచ్చారు. పోలీసులు సెల్ ఫోన్‌లో పలుమార్లు మాట్లాడగా తనకు ఇందిరమ్మ ఇల్లు కావాలని మాట్లాడాడు. అటు తర్వాత పోలీసులు డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్‌తో మాట్లాడి త్వరలో ఇల్లు మంజూరు చేయిస్తామని చెప్పడంతో టెలిఫోన్ టవర్ దిగాడు. దీంతో రాములు భార్య మౌనిక ఊపిరిపీల్చుకుంది. అనంతరం రాములు విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో కూడా సంపన్నవంతులకే ఇందిరమ్మ గృహాలు మంజూరు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మాత్రం ఉండడానికి నిలువెత్తు నీడ కూడా లేదని, వర్షాలకు తడవకుండా ఉండేందుకు పూరి గుడెసె మాత్రం వేసుకున్నానని బోరున విలపించారు.



టవర్ ఎక్కిన రాములును కిందకు దింపి మాట్లాడుతున్న పోలీసులు

అవస్థల చదువులు

- వంట గదులు లేక ఇబ్బందులు
- పొగతో సతమతమవుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- సమస్యల వలయంలో ఆ పాఠశాలలు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక పాఠశాలతో పాటు ఉన్నతపాఠశాలలో మధ్యాహ్నం భోజనం తయారీ విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారింది. భోజనం తయారు చేసేందుకు రెండు పాఠశాలల్లో వంట గదులు లేవు. దీంతో పాఠశాలల ఆవరణలోనే వంట వండుతున్నారు. హైస్కూల్ లైబ్రరీ భవనం ముందు టార్పాలిన్‌తో వేసిన ఓ గుడిసెలో కట్టెల పొయ్యి మీదే వంట చేస్తుండగా ఆ పొగ పాఠశాల మొత్తం వ్యాపిస్తోంది. ప్రైమరీ పాఠశాలలో మూడో తరగతి వరండాలో వంట వండుతుండటంతో పొగంతా లోపలికి వెళ్తోంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఈ పొగ పక్కనున్న పాఠశాలలోకి కూడా వెళ్తుండటంతో అక్కడి విద్యార్థులు అవస్థ పడుతున్నారు.



ఉన్నత పాఠశాల ఆవరణలో వంట వండుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

అసంపూర్తి గది..

అందుబాటులో లేని టాయిలెట్లు

పాఠశాల ఆవరణలో సగం నిర్మించి వదిలేసిన షెడ్డు నిరుపయోగంగా మారింది. గతంలో డైనింగ్ హాల్ నిర్మాణాన్ని సుమారు రూ.5లక్షల నిధులతో చేపట్టగా అది గోడలకే పరిమితమైంది. సుమారు 600 చదరపు అడుగుల్లో దీని నిర్మాణం చేపట్టి వదిలేయడంతో ఎందుకూ పనికి రాకుండా పోతోంది. పాఠశాలకు అంతంత మాత్రమే స్థలం ఉండగా అందులో అసంపూర్తి నిర్మాణంతో అది నిరుపయోగంగా మారింది. అసంపూర్తిగా ఉన్న గదిని పూర్తి చేస్తే రెండు పాఠశాలలకు వంట గదులతో పాటు డైనింగ్ హాల్‌కు ఉపయోగపడే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే ప్రైమరీ, హైస్కూల్‌లో కలిసి సుమారు 160 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా అక్కడ మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. గతంలో ఉన్న మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోగా అక్కడి నీరు బయటకు వెళ్లే అవకాశమూ లేదు. దీంతో అప్పుడప్పుడు దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వంట గదులతో పాటు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రాథమిక పాఠశాలలో తరగతి వరండాలోనే వంట వండుతున్న దృశ్యం

వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీకి యత్నం

కేసముద్రం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని అమీనాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించాడు. శనివారం రాత్రి ఓ అగంతకుడు ఆలయం గర్భగుడి ప్రధాన ద్వారం తలుపునకు వేసి ఉన్న గొళ్లాన్ని విరగొట్టినట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. ఈ తలుపుకు మరో సెంట్రల్ లాక్ ఉండడంతో అగంతకుడు ప్రయత్నం విరమించుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. ఆదివారం ఉదయం ఆలయ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించి ఆలయ కమిటీకి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజి సేకరించి విచారణ చేపట్టారు. 2022, జూన్ 11న రాత్రి ఆలయంలోని తలుపులను పగులగొట్టి రూ.17.95లక్షలు విలువైన దేవుళ్ల విగ్రహాలపై అలంకరించిన 25కిలోల వెండి, 5 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైన ఘటన అప్పట్లో సంచలనం రేపింది. ఈ కేసులో కొన్ని నెలల తర్వాత దొంగలను పట్టుకొని సొత్తును రికవరీ చేశారు. తాజాగా చోరీకి యత్నం జరగడంతో భక్తుల్లో ఆందోళన నెలకొంది.

చిన్నారి తల్లిదండ్రులకు మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ

కాటారం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ధన్వాడలో గుండెకు రంధ్రం పడి అనారోగ్యంతో బాధపడుతున్న 50 రోజుల చిన్నారి కుటుంబాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం పరామర్శించారు. బోడ శ్రీధర్, రశ్మిత దంపతులకు నెలన్నర రోజుల క్రితం కూతురు జన్మించగా అనారోగ్యం పాలైంది. ఆస్పత్రిలో చూపించగా గుండెకు మూడు చిన్న రంధ్రాలున్నాయని వైద్యులు చెప్పారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న మంత్రి శ్రీధర్‌బాబు వారింటికి వెళ్లి పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారని, పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చవుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేయగా మంత్రి సానుకూలంగా స్పందించారు. సాయం అందిస్తానని హామీనిచ్చారు. మంత్రి వెంటకాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మండల అధ్యక్షుడు చీటూరి మహేష్, కాంగ్రెస్ నాయకులు సుగుణ, విలాస్‌రావు, తిరుపతిగౌడ్, మహేశ్వరి, శకుంతల, వెంకట్‌రెడ్డి, భూపెల్లి రాజు, దేవేందర్‌రెడ్డి, నరేష్, శ్రీశైలం ఉన్నారు.



చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు

30 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఓ మినీ ట్రక్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల నల్లబెల్లంతోపాటు 5 క్వింటాళ్ల పటికను పట్టుకున్నట్లు ఎస్సై ఖాదర్‌పాషా ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మండలం ముల్కలపల్లి నుంచి తోడేళ్లగూడెంవైపు అశోక్ లేలాండ్ మినీట్రక్ వాహనంలో తరలిస్తుండగా తోడేళ్లగూడెం శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. బెల్లం, పటికను తరలిస్తున్న మినీట్రక్‌ను స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన డ్రైవర్ ఎస్‌కె.రాజ్, మహబూబాబాద్‌కు చెందిన భూక్య సురేష్, తేజావత్ ఉదయ్‌లను అదుపులోకి తీసుకుని, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయం గోడ కూలి వ్యక్తి మృతి



జంపన్న (ఫైల్)

బయ్యారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఆలయం గోడ కూలి వ్యక్తి మృతి చెందగా, ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు బయ్యారం ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... బయ్యారం మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన మునగాల జంపన్న(47) స్లాబ్‌కటింగ్ పని చేస్తూ జీవనం సాగి స్తున్నాడు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వెనుక వైపు గోడ దెబ్బతిని కొంత కాలంగా ఒకవైపు ఒరిగి ఉండటంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని పలువురు గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు గోడను కూలగొట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఆదివారం జంపన్న తన వద్ద ఉన్న స్లాబ్ కటింగ్ మిషన్‌తో గోడను కూలగొడుతున్నాడు. ఈ క్రమంలోనే జరిగిన ప్రమాదంలో ఒక్కసారిగా ఆలయం గోడ కూలడంతో జంపన్న తీవ్రంగా గాయపడ్డాడు. గోడ మీద పడి నడుము భాగం నుంచి కింద భాగం కాళ్ల వరకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా జంపన్న మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, మృతుడి తండ్రి సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

టేకు కలప స్వాధీనం

వెంకటాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీశాఖ అధికారులు ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. మండల అటవీశాఖ అధికారి వంశీకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెండు పికప్ వాహనాల్లో టేకు కలపను తరలిస్తున్నారనే సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బందితో కలిసి అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో రామచం ద్రాపురం గ్రామ సమీపంలో ఒక వాహనాన్ని, వెంకటాపురం మండలకేంద్రంలోని శివాలయం సమీపంలో మరొక వాహనాన్ని పట్టుకున్నారు. రెండు వాహనాల్లో 16 టేకు దుంగలు బయటపడ్డాయి. వాహనాలతోపాటు టేకు దుంగలను అటవీశాఖ కార్యాలయానికి తరలించామని ఫారెస్టు అధికారి వంశీకృష్ణ తెలిపారు. టేకు దుంగల విలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వివరించారు.



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు, టేకు కలప

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



భారతమ్మ (ఫైల్)

నెల్లికుదురు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిగలవీడులో ఆటో బావిలో పడి గాయపడిన వృద్ధురాలు శ్రీరాం భారతమ్మ(65) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. జూలై 27న ఆటోలో వెంకటపురం బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఆటో బావిలో పడటంతో భారతమ్మకు తీవ్ర గాయాలు కాగా, హైదరాబాద్ ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు మనమరాలు బేతమల్ల సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వార్డెన్‌పై విద్యార్థి బంధువుల దాడి

గూడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని ఓ ఆశ్రమ పాఠశాల వార్డెన్‌పై విద్యార్థిని బంధువులు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గూడూరు సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి ధూమపానం చేశాడని వార్డెన్ మందలించినట్లు చెప్పారు. సదరు విద్యార్థి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. ఆశ్రమ పాఠశాలకు చేరుకున్న విద్యార్థి బంధువులు అకారణంగా తమ పిల్లవాడిని ఎందుకు మందలించారని వార్డెన్‌పై దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. పాఠశాల వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డి మందు తాగి యువకుడి మృతి



సురేశ్ (ఫైల్)

మరిపెడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలతో ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మరిపెడ మునిసిపల్ పరిధి మాకులతండాకు చెందిన ఇస్లావత్ సురేశ్ (22) అనారోగ్యంతో కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నారు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఎవ్వరులేని సమయాన గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకొని పడిపోయారు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి తల్లితండ్రి, ఓ సోదరుడు ఉన్నారు. మరిపెడ పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నేతలు గంధసిరి అంబరీశ, బోడా రమేశ్, చందు నాయక్ పరామర్శించి కొంత ఆర్థిక సహాయం అందచేశారు.

ప్రశాంతంగా ముగిసిన మావోయిస్టుల వారోత్సవాలు

- ఏజెన్సీలో ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

వాజేడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఏజెన్సీలో ప్రశాంతంగా ముగిసాయి. జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు గ్రామ గ్రామాన జరుపుకోవాలని మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఏజెన్సీ వాసులు భయాందోళన చెందారు. వారం రోజులుగా ఏజెన్సీలో పోలీసులు ముమ్మర వాహనాల తనిఖీలు నిర్వహించి మావోయిస్టులపై డేగ కన్ను వేశారు. అడుగడుగునా మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆదివారం సైతం పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ సరిహద్దు గ్రామమైన దుబ్బ గుడెం కడేకల్ గ్రామ సమీపంలో ఛత్తీస్‌గఢ్ ప్రయాణికులను సోదా చేశా రు. అనుమానితులను ఫింగర్ ప్రింట్ స్కానర్‌తో తనిఖీ చేశారు. సీఆర్పీఎఫ్ బలగాలు, సివిల్ పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వాహనాల తనిఖీ

ములుగు రూరల్(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని జగ్గన్నపేట శివారులో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన, ఏజెన్సీలో తమ ఉనికిని కాపాడుకునేందుకు మావోయిస్టులు దుశ్చర్యలకు పాల్పడే అవకాశం ఉందని ముందుగా అప్రమత్తమైనట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ తనిఖీలో భాగంగా అపరిచిత వ్యక్తుల సమాచారాన్ని రాబట్టామని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్, సివిల్ పోలీసులు, టీజీఎస్‌పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఛత్తీస్‌గఢ్ ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తున్న పోలీసులు

మూగ జీవాలను తరలిస్తున్న ఇద్దరిపై కేసు

ములుగు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మూగ జీవాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ములుగు బస్టాండ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఆదివారం టీఎస్ 25 టీ 7342 నెంబరు గల బొలేరో గూడ్స్ వాహనంలో ఎనిమిది మూగ జీవాలను బంధించి ఉన్నట్లు గమనించామన్నారు. అందులో 5 ఆవులు, 3 ఎద్దులు, ఒక గేదె ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో వాహనాన్ని అదుపులోకి తీసుకొని మూగ జీవాలను గోశాలకు తరలించామని అన్నారు. మూగ జీవాలను నిర్బంధంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు.



పోలీసుల అదుపులో ఉన్న బొలెరోలోని మూగ జీవాలు

కరెంటు సరఫరా నిలిపివేయడంతో కోళ్లు మృతి

కేసముద్రం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తౌర్యతండా పరిధిలో ఆదివారం చెట్లకొమ్మలను నరికి వేసేందుకు విద్యుత్ సరఫరా నిలిచివేయడంతో తమ కోళ్ల ఫారంలో సుమారు 50 కోళ్లు మృతి చెందినట్లు మూడావత్ బుజ్జి, హక్య తెలిపారు. విద్యుత్‌అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఏఈ రాజు మాట్లాడుతూ చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడడంతో దాన్ని సరిచేసేందుకు సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు.



తౌర్యతండాలో మృతి చెందిన కోళ్లను చూపిస్తున్న బుజ్జి, హక్య

సందడిగా జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆదివారం సందడిగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఓపెన్ టు ఆల్ విభాగంలో నిర్వహించిన చెస్ పోటీల్లో 50మంది బాలబాలికలు పాల్గొన్నారని క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్న తెలిపారు. రెండు రోజుల నిర్వహణలో భాగంగా తొలిరోజు నిర్వహించిన మొదటి మూడు రౌండ్లు ముగిసేసరికి షేక్ రియాజ్, అభినవ్ సాయి, యశ్వంత్, రామ రిషిత్‌కుమార్ ముందజంలో ఉన్నట్లు కన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్లు, సీనియక్ క్రీడాకారులు పాల్గొన్నారు.

327 అసోసియేషన్ ట్రాన్స్‌కో యూనిట్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) ట్రాన్స్‌కో యూనిట్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఆదివారం హనుమకొండలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. ట్రాన్స్‌కో అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ మారియా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కళ్యాణ్ మురళి, ఎం.శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్స్‌గా ఈ.మధుకర్, టి.అశోక్, కె. శ్రీధర్, పి.మల్లేష్, రాఘవేంద్ర, ఎ.రాజు సెక్రటరీగా ఆర్.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీస్‌గా టి.శ్రీనివాస్, షైన రాజు, శివ, ఇమ్మానియేల్, ఆర్గనైజేషన్ సెక్రటరీస్‌గా జి.రజిత, ఎం.రాజు, జె.శ్రీనివాస్, నీల రవికుమార్, షర్మిల, ట్రెజరర్‌గా సంగోజు రామకృష్ణ, ఆఫీస్ సెక్రటరీగా కవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రమేశ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతలపూడి సతీష్ పాల్గొన్నారు.

వరంగల్‌కు వచ్చినప్పుడు రుద్రేశ్వరుడిని దర్శించుకుంటా..

- రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వరంగల్ నగరానికి ఎప్పుడు వచ్చినా వేయిస్తంభాల రుద్రేశ్వరాలయాన్ని దర్శించుకుంటానని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా అన్నారు. పోలీస్ అధికారిగా వరంగల్‌లో పని చేసినప్పుడు పలుమార్లు రుద్రేశ్వరుడిని దర్శించుకొని అభిషేకించుకోవడం వల్ల మానసిక ప్రశాంతత ఏర్పడేదన్నారు. పోలీస్ స్పోర్ట్స్ మీట్ సందర్భంగా నగరానికి చేరుకున్న రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా ఆదివారం ఉదయం వేయిస్తంభాల రుద్రేశ్వరాలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఈవో అనిల్‌కుమార్ అపూర్వంగా స్వాగతించారు.రుద్రేశ్వరాలయంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహింపజేసి మారేడు దళార్చన చేయించారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో స్వామి వారి తీర్థ ప్రసాదాలు డీజీపీ సౌమ్యమిశ్రాకు అందజేసి వేద ఆశీర్వచనం, శేష వస్త్రాలు బహూకరించారు.



ఆలయంలో అర్చకులచే ఆశీర్వచనం అందుకుంటున్న సౌమ్యమిశ్రా

డీడీఎన్ ఎవరికో!?



- దేవాలయాల దరఖాస్తుల పరిశీలన పూర్తి
- ప్రత్యేక కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలన
- 110 దరఖాస్తులు అర్హమైనవిగా గుర్తింపు
- త్వరలో ఎంపికైన ఆలయాల జాబితా ప్రకటన
- దసరా నాటికి ఈ గుళ్లలో ధూప, దీప, నైవేద్యం

హనుమకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో నిత్య ధూప, దీప నైవేద్యం (డీడీఎన్) పథకం కోసం దేవాదాయ, ధర్మాదాయ శాఖకు వచ్చిన దరఖాస్తులు ఒక కొలిక్కివచ్చాయి. ఆ శాఖ అధికారులు వాటిని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ మే 24తో ముగిసింది. అర్హత సాధించిన వారి దరఖాస్తులను వెంటనే కంప్యూటరీకరణ చేశారు. అర్హమైనవిగా భావించిన దరఖాస్తుల జాబితాను దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపించారు. డీడీఎన్ కోసం వచ్చిన మొత్తం 282 దరఖాస్తుల్లో 110 అర్హమైనవిగా తేల్చారు. ప్రస్తుతం ఇవి కమిషనర్ పరిశీలనలో ఉన్నాయి. వీటిలో ఎన్ని ఎంపిక అవుతాయనేది త్వరలోనే తేలనున్నది. దసరా నాటికి ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి డీడీఎన్ కిందకు వచ్చే గుళ్ల జాబితాను ప్రకటించ వచ్చునని తెలుస్తోంది.

క్షేత్రస్థాయిలో పరిశీలన

రాష్ట్ర దేవాదాయ శాఖ డీడీఎన్ పథకానికి సంబంధించి ఎంపిక చేసే గుడుల అర్హతలు పక్కాగా ఉండాలని ఉత్తర్వులో పేర్కొన్నది. ఆలయానికి 15 ఏళ్ల చరిత్ర ఉండాలి. ప్రాచీన దేవాలయాలకు తొలి ప్రాధాన్యం కల్పిస్తారు. దేవాదాయ శాఖలో ఆలయం నమోదై ఉండాలి. దేవాలయాలకు ఎలాంటి ఆస్తులు ఉండకూడదు. దరఖాస్తుదారుడు 18-65 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి. పూజారికి మంత్రోచ్ఛరణలతో కూడిన పూజా విధానం సంపూర్ణంగా, ఆగమశాస్త్రం ప్రకారం తెలిసి ఉండాలి. కేవలం జాతర సమయాల్లో తెలిచే ఆలయాలకు ఈ పథకం వర్తించదు. ఒక అర్చకుడికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఒకే ప్రాంగణంలో ఉన్న ఉప, అనుబంధ ఆలయాలకు ఈ పథకం వర్తించదు.

చిన్న దేవాలయాల్లో..

గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఎలాంటి ఆదరణకు నోచుకోని చిన్న దేవాలయాల్లో ప్రతీ రోజు ధూప, దీప, నైవేద్యం నిర్వహించేందుకు డీడీఎన్ పథకం కోసం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అర్చకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లా కేంద్రంలోని దేవాదాయ, ధర్మదాయ సహాయ కమిషనరు కార్యాలయానికి ఉమ్మడి జిల్లా నుంచి 282 దరఖాస్తులు వచ్చాయి. వాటిని నియోజకవర్గాల వారీగా విభజించేందుకు సిబ్బంది నెలంతా కసరత్తు చేశారు. ఇందులో అర్హత ఉన్నవి 110గా తేల్చారు.

కమిటీ ద్వారా తనిఖీ

దరఖాస్తులను ప్రభుత్వం నియమించిన జిల్లాస్థాయి కమిటీ పరిశీలించింది. అదనపు కలెక్టర్ చైర్మన్ కాగా, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌తో పాటు జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో పని చేసే ఇద్దరు అర్చకులు, ఇప్పటికే డీడీఎన్ పథకం కింద పని చేస్తున్న గుడి అర్చకుడు ఒకరు సభ్యులుగా ఉన్న ఈ కమిటీ అర్హత సాధించిన దరఖాస్తుల తాలూకు గుళ్లను క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేసింది. జీపీఎస్ లొకేషన్ ఫొటోలు తీసుకున్నారు. వాటి ప్రతిపాదనలు రాష్ట్ర అధికారులకు పంపించారు. డీడీఎన్ పథకంలోని ఆలయాల తుది జాబితా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచే వెల్లడవుతుందని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత తెలిపారు.

జోరుగా పైరవీలు

ధూప, దీప, నైవేద్యం పథకం కోసం జోరుగా పైరవీలు నడుస్తున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు తాము అనుకున్న ఆలయాలను ఈ పథకంలో ఎంపికచేయాలని దేవాదాయశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆయా ప్రజాప్రతినిధులు లేఖలను దరఖాస్తులకు జతచేసి పంపించినట్టు సమాచారం. ప్రస్తుతం ఆయా గుళ్ల పూజారులు హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎలాగైనా తమ గుడిని డీడీఎన్ పథకంలో చేర్చాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు మాత్రం నిబంధనల మేరకే డీడీఎన్ పథకంలో ఆలయాలను ఎంపిక చేస్తామని చెబుతున్నారు. దరఖాస్తులు అధికంగా రావడంతో మరిన్ని ఆలయాలకు అవకాశం కల్పించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు దేవాదాయశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పరీక్షగా మారిన ఎంపిక

రాష్ట్రవ్యాప్తంగా 250 ఆలయాలకు ఈ పథకంలో ఎంపిక చేయనుండగా ఇందు కోసం దరఖాస్తులు భారీ సంఖ్యలో వచ్చాయి. ఆలయాలు తక్కువగా ఉండడం, దరఖాస్తులు ఎక్కువగా రావడంతో ఆలయాల ఎంపిక అధికారులకు పెద్ద పరీక్షగా మారింది. ఒక్కో ఉమ్మడి జిల్లాలో 20 ఆలయాల చొప్పున మాత్రమే ఈ పథకంలో ఎంపికయ్యే అవకాశం ఉంది. అర్బన్ నియోజకవర్గాలను మినహాయిస్తే జిల్లాలో 10 గ్రామీణ నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున ఎంపిక కావచ్చునని తెలుస్తోంది.

గౌరవ వేతనం ఇలా..

ఆదాయం తక్కువ ఉన్న ఆలయాల్లో నిత్యం దీపం వెలగాలని 2007లో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ధూప, దీప, నైవేద్యం పథకం ప్రారంభమైంది. తొలుత ఒక్కో ఆలయానికి రూ.2500 కేటాయించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ.6వేలు, ఆ తర్వాత రూ.10వేలకు పెంచారు. ఇందులో పూజారుల గౌరవ వేతం రూ.6వేలు, పూజా సామగ్రికి రూ.4వేలు.

ఉమ్మడి జిల్లాలో..

ధూప, దీప, నైవేద్యానికి నోచుకోని దేవాలయాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో 180 వరకు ఉన్నట్టు దేవాదాయ శాఖ గుర్తించింది. ధూప, దీప, నైవేద్యం పథకం కింద తాజాగా దాఖలైన దరఖాస్తుల్లో అర్హమైనవిగా గుర్తించి 110 దేవాలయాలు వీటిలో ఉన్నా యి. డీడీఎన్ పథకం కింద వీటిలో ఎన్ని ఎంపికవతాయనేదాని మీద చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 450 గుళ్లలకు ధూప, దీప, నైవేద్యం పథకం వర్తిస్తోంది. గతంలో రెండు విడతలుగా వీటిని ఎంపిక చేశారు. ఈ గుళ్లలో నిత్య ధూప, దీప, నైవేద్యం జరుగుతోంది. కొత్త వాటి ఎంపికతో త్వరలోనే మరికొన్ని ఆలయాలకు డీడీఎన్ వర్తించనున్నది. తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలు కొనసాగాలంటే దేవాలయాలు సక్రమంగా నిర్వహించాలి. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ తీసుకున్న చర్యతో ఎంతోమందికి ఊరటనిచ్చే అంశం. గ్రామీణప్రాంతాల్లో ఆదాయం లేకున్నా చిన్న దేవాలయాలను అనువంశిక అర్చకులు, లేదా స్థానికంగా ఉన్న పూజారులు సొంత డబ్బుతోనే లేక దాతలు ఇచ్చే దానాలతో పూజలు నిర్వహిస్తున్నారు.

వినూత్న ఆవిష్కరణల వేదిక తేజస్

- ఈ మిషన్ సృష్టికర్త పదిహేనేళ్ల అనిరుధ్
- ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి
- ముగ్ధులైన నవీన్ నికోలస్, యోగితారాణా
- వరంగల్ జిల్లాలో అమలుకు అనుమతి



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌కు తేజస్ మిషన్ ప్రతిని అందజేస్తున్న విద్యార్థి అనిరుధ్

హనుమకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల యువ ప్రతిభావంతుడు గుండు అనిరుధ్ రూపకల్పన చేసిన తెలంగాణ జ్ఞాన ఆవిష్కరణ సంకల్పం (తేజస్) మిషన్ వరంగల్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుకు ఎంపికైంది. ప్రభుత్వ పాఠశాలలు వేదికగా విద్యార్థుల సర్వతోముఖ వికాసం లక్ష్యంగా రూపొందించిన ఈ మిషన్ పైలెట్ ప్రోగ్రామ్ వర్చువల్ టింకరింగ్ ల్యాబ్ (వీటీఎల్) ద్వారా సాంకేతికతతో కూడిన నూతన ఆవిష్కరణల కోసం ఉద్దేశించిది కావడం విశేషం. అనిరుధ్ రూపొందించిన ఈ ప్రాజెక్టును ఎంఎల్‌సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పాఠశాల విద్యా డైరెక్టర్ నవీన్ నికోలస్, ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా దృష్టికి తీసుకువెళ్లారు. నికోలస్ ఈ ప్రాజెక్టుకు ముగ్ధులయ్యారు. సాంకేతిక నిపుణుల బృందంతో ఈ మిషన్‌ను అధ్యయనం చేయించారు. ఇది అమలైతే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని భావించారు. తేజస్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఆచరణలో పెట్టే ముందు వరంగల్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు అనుమతిచ్చారు. సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి ఈ మేరకు అధికారికంగా ప్రొసీడింగ్ విడుదలైంది. దీంతో వరంగల్ జిల్లాలో 800లకుపైగా ప్రభుత్వ పాఠశాలల్లో జేజస్ మిషన్ త్వరలో అమలులోకి రానున్నది.

చిన్నవయసులోనే..

అనిరుధ్ ప్రస్తుతం పెద్దపెండ్యాలలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 11వ తరగతి (సీబీఎస్) చదువుతున్నాడు. తండ్రి గుండు రమేష్ ఖిలా వరంగల్ మండలం స్తంభంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు, తల్లి స్రవంతి గృహిణి. పాఠశాల స్థాయిలో విద్యారంగంలో సరికొత్త ఆవిష్కరణలను తీసుకువచ్చే లక్ష్యంతో ఏడాదిపాటు శ్రమించి తెలంగాణ జ్ఞాన ఆవిష్కరణ సంకల్పం (తేజస్) మిషన్‌కు రూపకల్పన చేశాడు. మిషన్ ఇప్పటికే పలువురు విద్యావేత్తల ప్రశంసలు పొందింది.

ప్రాజెక్టు లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులను భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే ఇన్నోవేషన్ హబ్‌లుగా తీర్చిదిద్దడం, విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, ఆవిష్కరణాత్మకత, స్వతంత్ర ఆలోచానాపరులుగా ఎదగడానికి వారిలో 21 శతాబ్దపు నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, గ్రామీణ పాఠశాలల్లో స్థానిక సమస్యలపై విద్యార్థుల తమ సొంత ఆలోచనలతో నవీన పరిష్కారాలు కనుగోనేలా ప్రేరేపించడం, విద్యార్థులు 21వ శతాబ్దపు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ ముందుకు సాగేలా ప్రోత్సహించడం ఈ ప్రాజెక్టు లక్ష్యాలు.

వినూత్న ఆవిష్కరణలకు ప్రేరణ : అనిరుధ్

ఈ మిషన్ ద్వారా విద్య అనుభవాత్మకం, బోధనాత్మకం, ఆవిష్కరణాత్మకంగా మారుతుంది. విద్యార్థులు విజ్ఞానంతో ఆవిష్కరణల సామర్థ్యాన్ని అలవర్చుకుంటారు. వినూత్న ప్రాజెక్టు వికసిత్ భారత్-20247, తెలంగాణ రైజింగ్-2047 వంటి దృఢమైన లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర విద్యారంగాన్ని కొత్త దిశగా నడిపించేందుకు బలమైన పునాది వేస్తుంది. కేంద్రం రాష్ట్రంలో 900 పాఠశాలల్లోనే అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్) ఏర్పాటు చేసింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా 30వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఏటీఎల్ లేని మిగతా పాఠశాలల పరిస్థితి ఏమిటీ? ఈ లోటును పూడ్చడానికే ఈ తేజస్ మిషన్‌ను తీసుకువచ్చాను. అందుబాటులో ఉన్న వనరులను వాడుకోవడం ద్వారా అటల్ టింకరింగ్ మిషన్ ఎకోసిస్టమ్‌నే రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలన్నదే ఈ మిషన్ లక్ష్యం.



డీఆర్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న దేవులపల్లి రాఘవేందర్

కాజీపేట రైల్వే స్టేషన్ తనిఖీ

కాజీపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం డీఆర్‌ఎం ఆర్.గోపాల్‌కృష్ణన్ తనిఖీ చేశారు. క్రూలాబీ, రన్నింగ్ రూమ్‌లు తనిఖీ చేశారు. రైల్వే ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైల్వే కమ్యూనిటీ హాల్‌లో బ్యాడ్మింటన్, టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. రైల్వే జనరల్ ఇన్స్టిట్యూట్ దేవులపల్లి రామవేందర్ రైల్వే ఇన్సిస్టిట్యూట్ అభివృద్ధి పనులపై వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, కార్మిక, నాయకులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై కేసులు నమోదు

నెక్కొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండలో ఎలాంటి అర్హతలు లేని ముగ్గురు వ్యక్తులు ఆదర్శ వైద్యులమని చెప్పుకుంటూ వైద్య సేవలను అందిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్‌కుమార్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అర్హతలు లేకుండా ఆదర్శ వైద్యులమని చెప్పుకుంటూ రిజిష్టర్డ్ వైద్యుల వలే అల్లోపతి వైద్యం నిర్వహిస్తున్న ముగ్గురు నకిలీ వైద్యులను గత నెలలో నెక్కొండలో జరిగిన తనిఖీల్లో గుర్తించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్యకుమార్, చైర్మన్ డాక్టర్ కె.మహేష్‌కుమార్‌ల ఫిర్యాదు మేరకు నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో 2025 ఆగస్టు 2వ తేదీన కేసు నమోదు చేశారన్నారు. నెక్కొండలోని లావణ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు రమేశ్, రుద్ర ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహకుడు రవి, అమ్మ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వకుడు అశోక్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం..

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- జేఎన్ఎస్‌లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ప్రారంభం
- 33 జిల్లాల నుంచి 1400 మంది అథ్లెట్లు హాజరు



స్టాటర్ పేల్చి పరుగు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్‌పై 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ... నగరంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియంతో పాటు స్పోర్ట్స్ పాఠశాల కావాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు స్పోర్ట్స్ పాఠశాలలో అడ్మిషన్లు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన క్రికెట్ స్టేడియం నగరంలో త్వరలో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 15న జేఎన్ఎస్‌లో తాత్కాలికంగా స్పోర్ట్స్ పాఠశాలలో 4వ తరగతిలో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు పాఠశాల నిర్వహణ కోసం కొంతమంది సిబ్బందిని కేటాయించడానికి కసరత్తులు చేపట్టామన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. జిల్లా క్రీడా అధికారి ప్రతీరోజు స్టేడియాన్ని సందర్శించి స్టేడియంలో పేరుకుపోయిన సమస్యలు, క్రీడాకారులకు కావాల్సిన వసతులను సమకూర్చడంతో పాటు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకరావలని ఆదేశించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు చారిత్రాత్మక ఓరుగల్లు నగరంలోని సుప్రసిద్ధ దేవాలయాలు, కట్టడాలను తిలకించాలని ఎమ్మెల్యే నాయిని కోరారు.

విశిష్ట అతిథి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. పట్టుదల, క్రమశిక్షణతో క్రీడల్లో సాధన చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చన్నారు. నేటి యువత స్మార్ట్ ఫోన్‌లకు అలవాటు పడి మైదానాలను మరిచిపోతున్నారని, వారిని మైదానాలకు పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. తన చిన్నతనంలో మైదానంలో సాధన చేసిన సందర్భంలో కాళ్లకు షూస్ కూడా లేవన్నారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని అహర్నిశలు శ్రమించి క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వతహాగా క్రీడాకారులు కావడం, క్రీడాకారుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి యంగ్ ఇండియా పేరుతో ప్రోత్సాహకాలు అదిస్తున్నారన్నారు. హైదరాబాద్ క్రికెటర్ సిరాజ్, అంతర్జాతీయ బాక్సర్ నిఖత్‌జరీన్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పారా ఒలంపియన్ జీవాంజి దీప్తీల ప్రతిభను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి వారికి నగదు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఇళ్ల స్థాలాలు అందించారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో ఒలంపిక్స్ క్రీడలు నిర్వహించే స్థాయిలో సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తున్నారన్నారు. నేడు కొంత మంది యువత సెల్‌ఫోన్‌లకు అలవాటు కావడంతో పాటు డ్రగ్స్ ఇతర చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కావాలని, దానికి యువత సహకారం ఎంతో ఉందన్నారు. స్వతహాగా హాకీ క్రీడాకారుడిని అయినప్పటికీ నేటికి నగరంలో హాకీ మైదానం అందుబాటులేక పోవడం బాధాకరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో నగరంలో హాకీ కోర్టు ఏర్పాటుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకరించాలని ఎమ్మెల్యే నాగరాజు కోరారు.



పరుగు పందెంలో పోటీ పడుతున్న అథ్లెట్లు

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జేఎన్ఎస్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 33జిల్లాలతో పాటు 10స్పోర్ట్స్ పాఠశాలలకు చెందిన దాదాపు 1400మంది అథ్లెట్లు, 50మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొన్నరన్నారు. అండర్-14, 16, 18, 20, మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో తొలిరోజు జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్‌పై జంప్స్, త్రోస్, రన్స్‌లో క్రీడలు నిర్వహించమన్నారు. కాగా, జేఎన్ఎస్ క్రీడా మైదానానికి సమీపంలోని పాత్‌ఫైండర్ పాఠశాలలో అథ్లెట్లకు బస, స్టేడియంలో భోజనాలను ఏర్పాటు చేశామన్నారు. జూనియర్స్ బాలబాలికల విభాగంలో ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు సెప్టెంబర్ 9నుంచి 12 వరకు పాండిచ్చేరిలో నిర్వహించనున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. అదేవిధంగా మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ విభాగంలో ఆగస్టు 20నుంచి 24 వరకు చెన్నైలో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని సారంగపాణి అన్నారు. కాగా, తొలి రోజు వివిధ జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్ల మధ్య నిర్వహించిన జంప్స్, త్రోస్, రన్స్‌లో పోటాపోటీగా గెలుపు లక్ష్యంగా చిరుతల్లా దూసుకుపోయారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమన్నారాయణ, దిమ్మిక నాగరాజు, పీడీలు మనోజ్ కుమార్, వాసు, రజినికాంత్, వివిధ జిల్లాలకు చెందిన అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

దాశరథి కవితా స్ఫూర్తిని తెలియజేయాలి

- తెలుగు భాషపై మమకారాన్ని పెంచాలి
- ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న దేశపతి శ్రీనివాస్

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ఆస్థాన కవిగా విశేష సేవలందించి అపూర్వ సాహిత్య సృజన చేసి తన కవితాస్త్రంతో నిజాం రాజును ఎదురించిన దాశరథి కవితాస్ఫూర్తి నేటి విద్యార్థుల్లో నింపాలని, తద్వారా తెలుగు భాషపై మమకారాన్ని పెంపొందింపజేయాలని శాసనమండలి సభ్యుడు, ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్ అన్నారు. హనుమకొండలోని సాయిబాబా ఆలయ ఆడిటోరియంలో రాధాకృష్ణ సాహితీ వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన పద్య పఠనా పోటీల బహుమతులు, దాశరథి శతజయంతి వేడుకల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. సాహితీ వేదిక అధ్యక్షుడు, రాష్ట్ర తెలుగుభాష ఉపాధ్యాయ సంఘం నాయకులు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ కలాలనే కత్తులుగా మలుచుకొని ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన మహాకవి దాశరథి అని, ఆయన కలం నుంచి జాలువారిన సినీ సాహిత్యం కూడా ఎంతో అద్భుతమని కొనియాడారు. ఆయన జీవితంలోని అపూర్వ ఘట్టాలు సాహిత్య సృజన, ధిక్కార స్వరం ఆయన సాహిత్య సొబగులు ఈ తరం విద్యార్థులకు నేర్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విద్యార్థుల్లో సాహిత్యం పట్ల ముఖ్యంగా పద్యాలపట్ల ఆసక్తి పెంచేందుకు పోటీలు నిర్వహిస్తూ కార్యక్రమాలు నిర్వహించిన రాధాకృష్ణ సాహితీ వేదిక నిర్వాహకులను అభినందించారు.

చక్రవర్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగు భాష ఉపాధ్యాయుడిగా విద్యార్థులలో భాష పట్ల అవగాహన, ధైర్యం, ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దాశరథి శతజయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో అత్యధిక పద్యాలు చదివిన పర్వతగిరి విద్యార్థిని డి.దేవి ప్రథమ, వరంగల్ క్రిష్ణాకాలనీకి చెందిన గురుసూర్యచంద్‌కు ద్వితీయ, వర్ధన్నపేట ఇల్లంద కేజీబీవీకి చెందిన ఇ.శరణ్యకు తృతీయ బహుమతిగా, వారికి చదువులకు అవసరమయ్యేలా నగదు బహుమతులు అందజేశామన్నారు. గీసుగొండకు చెందిన అక్షిత, నెక్కొండకు చెందిన అక్షిత, దుగ్గొండికి చెందిన నాగశ్రీలకు ప్రత్యేక ప్రశంస కింద ప్రత్యేక బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయుల సంఘం వరంగల్ అధ్యక్షులు డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్, డాక్టర్ మడత భాస్కర్, గండు రవి, పరిపూర్ణాచారి, ఎస్‌వి.శ్రీదేవి, కె.కృష్ణమూర్తి, కొక్కెర్ల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితాన్ని కోరుకునేదే సాహిత్యం


- ఎమ్మెల్సీ మధుసూదనాచారి
- 'మనసు- మనిషి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సమాజ హితాన్ని కోరుకునేదే సాహిత్యమని, అలాంటి సాహిత్య సృజనచేసే వారి సంఖ్య పెరిగినప్పుడే సమాజంలో చైతన్యం వస్తుందని తెలంగాణ తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం, బాల సాహిత్య రచయిత మెండు ఉమామహేశ్వర్ కలం నుంచి జాలువారిన 'మనసు- మనిషి' పుస్తకావిష్కరణ సభ ఆదివారం హనుమకొండ కిషన్‌పురాలోని వాగ్దేవి ఆడిటోరియంలో జరిగింది. ఉదయం మిత్రమం డలి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాత్రికే యుడు దాసరి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం సిరికొండ మధుసూదనాచారి మాట్లాడారు. కసి, కృషి ఉంటే మనిషి ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారన్నారు. ఎన్నో ప్రతికూలతలను చిన్ననాటి నుంచి ధైర్యంగా ఎదుర్కొని ఎదిగిన వ్యక్తి పుస్తక రచయిత మెండు ఉమామహేశ్వర్ తన అనుభవాల సారాన్ని మనసు- మనిషి పుస్తకంలో దర్శింపజేశాడన్నారు. ప్రస్తుత సమాజంలో మానవజాతి కలుషితమైపోయిందని, ఇది అణుబాంబు కన్నా ప్రమాదకరంగా మారిందన్నారు. మన జీవితాలు ఉదయం కల్తీతో ప్రారంభమై కల్తీతో ముగుస్తున్నాయన్నారు. మనుషులను నాలుగు రకాలుగా తాను విభజించానని.. వారే క్రియేటర్స్, ఇమిటేటర్స్, స్పెక్టేటర్స్, ఫ్రస్టేటర్స్ అన్నారు. అద్భుతాలు సృష్టించే వారంతా అతి సాధారణ కుటుంబాల నుంచే వచ్చారన్నారు.

ప్రధాన వక్తగా విచ్చేసిన సీనియర్ పాత్రికేయుడు శెంకేసి శంకర్‌రావు పుస్తక విశ్లేషణ చేస్తూ.. మనిషిని నియంత్రించే మనసు మన చేతిలో లేదని, అది మార్కెట్ శక్తుల నియంత్రణలోకి వెళ్లిందన్నారు. బహిర్గత శక్తులు మనుషులను మాయ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మనసు- మనిషి పుస్తకంలో రచయిత మెండు ఉమామహేశ్వర్ అన్ని కోణాలను స్పర్శించారన్నారు. ఈ పుస్తకాన్ని ఇటీవల మరణించిన తన సోదరుడు ప్రముఖ జర్నలిస్టు మెండె శ్రీనివాస్‌కు అంకితం ఇవ్వడం సోదరుల మధ్య ఉన్న ఆప్యాయతకు నిదర్శనమన్నారు. ప్రపంచమంతా ఇప్పుడు ఇన్‌స్టా గ్రామం అయిపోయిందన్నారు. వ్యక్తిత్వ వికాసం అన్నది విలువల పునాది మీద నిర్మాణం కావాలన్నారు. ప్రస్తుత సమాజంలో చదువులు చదివిన వారు కూడా మనసు మీద నియంత్రణ కోల్పోయి అనేక ఆకృత్యాలకు పాల్పడుతున్నారన్నారు. మనిషి హార్డ్‌వేర్ అయితే మనసు సాఫ్ట్‌వేర్ అన్నారు. వ్యక్తిత్వ వికాసానికి ఈ పుస్తకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు జి.నాగేశ్వర్‌రావు, పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మైమ్ కళాధర్, మిమిక్రీ ఆర్టిస్ట్ రాంపల్లి సదాశివ, ఆర్.లక్ష్మణ్ సుధాకర్, వేణుమాధవ్, వల్లాల వెంకటరమణ, మెండు రవీందర్, పాత్రికేయులు, మేధావులు పాల్గొన్నారు.



గుంత.. ఇంతింత కాదయా..



ఏటూరునాగారం-భద్రాచలం జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు

ఏటూరునాగారం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 163 వాహనదారులకు నరకయాతనగా మారింది. నిత్యం వందలాది సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. అధికారులు కనీస నిర్వహణను విస్మరించడంతో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వరంగల్-భద్రాచలం మార్గంలో కీలకమైన ఎన్‌హెచ్-163 రహదారి ఏటూరునాగారం మీదుగా వెళ్తుంది. హైదరాబాద్ నుంచి భూపాలపట్నం వరకు ఈ రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారిపై నిత్యం భారీగా వాహనాల రాకపోకలు ఉంటాయి. భారీ వాహనాలతో పాటు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనదారులు సైతం నిత్యం ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. అయితే, తాడ్వాయి నుంచి ఏటూరునాగారం మండలం ముల్లెకట్ట వంతెన వరకు రహదారి అనేకచోట్ల కుంగిపోయి, లోతైన గాడాలు ఏర్పడ్డాయి. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఈ రహదారి మరింత అధ్వానంగా మారింది. దీంతో రహదారిపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతలు వాహనదారులకు మృత్యుకూపాలుగా మారాయి. రాత్రిపూట పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది.. కనీసం లైటింగ్ సౌకర్యం లేకపోవడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో గుంతలు కనిపించక నిత్యం ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

నిర్లక్ష్యం వెదజల్లుతున్న ఎన్‌హెచ్ అధికారులు

జాతీయ రహదారి నిర్వహణ బాధ్యతను చూసే అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహదారికి మరమ్మతులు చేయాలని, గుంతలను పూడ్చాలని స్థానిక ప్రజలు, వాహనదారులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. కనీసం అవసరమైన చోట రోడ్డు సేఫ్టీ చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటు, తగిన లైటింగ్ వంటి కనీస సౌకర్యాలు కూడా ఈ రహదారిపై లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

వాహనదారుల అవస్థలు

రహదారిపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు, గాడాలు చిన్న వాహనాలకు కూడా కింద ఇంజిన్‌లకు తగిలి తీవ్రంగా దెబ్బతింటున్నాయి. రోడ్డుపై టైర్లు వెళ్లిన ప్రాంతాల్లో కుంగిపోవడం, అక్కడక్కడా లారీలు దిగబడి గుంతలు ఏర్పడటంతో వాటిపై వాహనాలు వెళ్లినప్పుడు స్కిడ్ అయ్యి ప్రమాదాలకు గురవుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల నుంచే కాకుండా, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల నుంచి ఇసుకను భారీ లోడ్‌లతో తరలించే లారీలు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు నిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ వాహనాల అధిక జరువుతో రహదారి మరింత దెబ్బతింటోంది.

యాదవ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమేష్



వాజేడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన నల్లగాని రమేష్ యాదవ్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం యాదవ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌యాదవ్ మాట్లాడుతూ తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం యాదవ్‌తో పాటు సహకరించిన జిల్లా గౌరవ అధ్యక్షుడు నర్రావుల వెంకటేశ్వర్లు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేషబోయిన సాంబయ్యయాదవ్, జిల్లా కార్యదర్శి కోరె రవియాదవ్, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ కళాశాలకు భవనం మంజూరు చేయాలి : ఎస్ఎఫ్ఐ

వెంకటాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు భవనం మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చొక్కాల గ్రామంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. అదేవిధంగా మండలంలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని, రోడ్లకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం చేపట్టిన సమ్మెకు మద్దతు తెలియ జేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బాలు, హర్ష, చరణ్, రామ్,నాగచైతన్య, అభిలాష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

వెంకటాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్కావెంజర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని స్కావెంజర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యన్నమల్ల ప్రవీణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్కావెంజర్ల మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పూనెం నిర్మల, కార్యదర్శిగా ఆమని, ఉపాధ్యక్షులుగా కెక్కం నాగమణిలను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకురాళ్లు సరోజిని, రమణలక్ష్మి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

గోవిందరావుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు నిఘా నేత్రాలని, వ్యాపారులు వాటిని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. మండలకేంద్రంలోని వ్యాపారులు వారి షాపుల ముందు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ నేర నియంత్రణ కోసం వ్యాపారులు తమ షాపు పరిసరాలు కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం బాగుందని అన్నారు. అదేవిధంగా చల్వాయి గ్రామంలోని వ్యాపారులు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యాపారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లికి మొక్కులు



ముత్యాలమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

వెంకటాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెరికవాడలో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం గ్రామస్థులు మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసంలో ఆదివారం కావడంతో గ్రామస్థులు ముత్యాలమ్మతల్లిని తెల్లవారు జామునే భక్తిశ్రద్ధలతో బోనం వండుకుని ఆలయానికి చేరుకుని సమర్పించారు. పాడిపంటలు బాగా పండాలని, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అక్కిరామ్ నాయక్

మల్హర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా హట్కార్ అక్కిరామ్‌నాయక్, మండల అధ్యక్షుడిగా అజ్మీర సమ్మయ్యనాయక్‌ను నియ మించారు. ఈ మేరకు వారికి నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు పూల్‌సింగ్‌నాయక్ అందించారు. అక్కిరామ్‌నాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి ఉద్యమంలో జాతి కోసం నిరంతరం కృషి చేస్తూ ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారన్నారు.

'ఎల్‌పీఆర్ కన్వెన్షన్'ను ప్రారంభించిన ఎమ్మెల్యే



కన్వెన్షన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యజమానులు

గణపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎల్‌పీఆర్ ఏసీ కన్వెన్షన్ హాల్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం ప్రారంభించారు. ఎల్‌పీఆర్ కన్వెన్షన్ యజమాని లింగంపెల్లి పాపారావు, కుమారులు వేణుగోపాల్‌రావు, వెంకటేశ్వర్‌రావు, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే కన్వెన్షన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన్ను యాజమాని పాపారావు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కన్వెన్షన్ మొత్తం సెంట్రలైజ్డ్ ఏసీతో నిర్మించామని, సుమారు 2 వేల మందికి ఆతిథ్యం ఇవ్వగలమని అన్నారు. సువిశాలమైన పార్కింగ్ ప్రదేశం, బంకెట్ హాల్, గెస్ట్ రూమ్స్ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, నాయకులు రాజేందర్, చోటేమియా, అశోక్, కట్కూరి శ్రీనివాస్, చల్లూరి మధు, మలహల్‌రావు, ముత్యాల రాజయ్య, కన్నెబోయిన కుమార్, కృష్ణ, శంకర్, రామేశ్వర్ రావు, కావటి రవి తదితరులు ఉన్నారు.

'లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి'

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని సేవాలాల్ సేన భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు భూక్య సురేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 40లక్షల మంది లంబాడీలు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ఉద్ధరిస్తుందని ఓట్లు వేసి గెలిపిస్తే లంబాడీలకు మంత్రి ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించకుంటే దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యేపై అసత్యపు ఆరోపణలు తగవు : కాంగ్రెస్

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలోనే తమ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుపై బీఆర్ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని, ఇది ఏమాత్రం తగదని పట్టణంలోని 9, 11వ వార్డులకు చెందిన కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా అన్నంనేని గోపాల్‌రావు, అల్లం సుధాకర్, గడ్డం రమేష్, చెప్యాల సారయ్య, కలువల రాజయ్య, తోకల బాపురెడ్డి, గసిగంటి భద్రయ్య, భాస్కర్ విలేకరులతో మాట్లాడుతూ తమ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మచ్చలేని నాయకుడని అన్నారు. ప్రజల కోసం మాత్రమే పనిచేస్తున్నారని, ఎలాంటి అవినీతికి తావులేదని అన్నారు. పైగా గతంలో బీఆర్ఎస్ పనిచేయలేని పనులన్నీ చేస్తున్న నేపథ్యంలో ఓర్వలేక అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి చేస్తున్న క్రమంలో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని భావించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కుట్రపూరితంగా ఉసిగొలిపి గేదెలను క్యాంపు కార్యాలయంలోకి తోలారని దుయ్యబట్టరు. ఇది ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

మల్హర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఐదు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామని నిత్యావసర సరుకులు కొనుక్కొలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాజబాబు, కంప్యూటర్ ఆపరేటర్ రాజేంద్రప్రసాద్, సిబ్బంది చంద్రయ్య, మధునయ్య పాల్గొన్నారు.

సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు



ఫారెస్టులో ఏర్పాటు చేసిన పిల్లర్లు

మల్హర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల నుంచి కిషన్‌రావుపల్లి మీదుగా భూపాలపల్లికి రోడ్డు నిర్మాణ పనులు అటవీ ప్రాంతంలో సాగుతున్నాయి. ఆరు మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి సంబంధించి సర్వే పనులు పూర్తయ్యాయి. సుమారు ఏడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణంలో పోయే చెట్ల లెక్కలు పూర్తి కావచ్చింది. అలాగే రోడ్డు నిర్మాణంలో భాగంగా మలుపుల వద్ద పిల్లర్ల ఏర్పాటు పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. వారం రోజుల్లో పిల్లర్ల నిర్మాణం పూర్తికానుంది. ఈ రోడ్డుకు సంబంధించి ప్రతి 20 మీటర్లకు చిన్న పిల్లర్ల నిర్మాణం పనులు మొదలు కావాల్సి ఉంది.

చిల్డ్రెన్ పార్క్‌లో అదనపు హంగులు



పార్క్‌లో ఏర్పాటు చేసిన జిమ్, ఎక్సర్‌సైజ్ పరికరాలు

కాటారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో కాటారం-ప్రతాపగిరి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్క్‌కు మరింత వన్నె తెచ్చేలా అదనపు హంగులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గ్రీన్ పార్క్ నిర్మాణం కోసం సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించగా మండలకేంద్రం శివారులో అధికారులు పార్క్‌ను ఏర్పాటు చేసి పలు రకాల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఇటీవల జీపీ నిధులతో ప్రహరీ గోడ పిల్లర్లకు ఇంద్రధనుస్సు రంగులు వేయించారు. గ్రౌండ్‌లో మట్టిపోసి చదును చేయించి వాకింగ్ ట్రాక్, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. రెండు మూడు రోజుల క్రితం జిమ్, ఎక్సర్‌సైజ్ పరికరాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న ఆటవస్తువులకు అదనపు ఆకర్షణగా పులి, సింహం, జిరాఫీ, ఏనుగు వంటి జంతువుల బొమ్మలు ఏర్పాటయ్యాయి. కాగా పార్క్ ప్రారంభం కాకముందే స్థానిక పలు వాడలకు చెందిన పిల్లలు వచ్చి ఆటలు ఆడుతూ సందడిచేయడం కనిపిస్తోంది.

పోరాట యోధుడు రాజయ్య

వర్ధంతి సభలో నేతల నివాళి

వాజేడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పోరాట యోధుడు మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య అని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు కొనియాడారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఐదో వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరగ్గా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రఘుపతిరావు పాల్గొని మాట్లాడారు. పార్టీతో సంబంధం లేకుండా ఎవరు వెళ్లినా ఆయన వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేశారని అన్నారు. విద్య, వైద్యం అమలు కోసం అలుపెరుగని పోరాటం చేశారని, రహదారులు, విద్యుత్, రవాణా, ఇతర సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో కొట్లాడిన మహానేత రాజయ్య అని కొనియాడారు. పోడుభూములకు పట్టాలు, ఇళ్లస్థలాలు, ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు జనాభా ప్రాతిపదికన ఇవ్వాలని పోరాటం చేశారని తెలిపారు. కార్యక్ర మంలో నాయకులు కారం నాగేశ్వర్‌రావు, పాయం కుమారి, మోడెం బాబూరావు, కొర్సా వెంకన్న, శాంతకుమారి పాల్గొన్నారు.

● వెంకటాపురం : మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఐదో వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజయ్య భద్రాచలం నియోజకవర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ఏజెన్సీ ప్రజలకు ఎంతగానో సేవలందించారని, పార్టీ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యానం వాసు, కుమ్మరి శ్రీను, కట్ల నర్సింహాచారి, రాజేష్, ప్రసాద్, మాణిక్యం పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం.. సీఎం సహాయనిధి

(5వ పేజీ తరువాయి)

అన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వ ఆస్పత్రిని తీర్చిదిద్దుతున్నామన్నారు. క్యాన్సర్ పరీక్షలు సహా ఎంఆర్ఐ, సీటీ స్కాన్ యంత్రాలను సైతం అందుబాటులోకి తెస్తున్నట్టు తెలిపారు.

రేగొండలో చెక్కుల పంపిణీ

రేగొండ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతువేదికలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ సర్కారుపై ప్రతిపక్ష నాయకులు దిగజారుడు ఆరోపణలతో నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇసుక ధరలు తగ్గించి ప్రజలకు న్యాయం చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే ధర్నా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, ప్రిన్సిపాల్ మనోరమ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, కాంగ్రెస్ రేగొండ టౌన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, జిల్లా నాయకులు మోడెం ఉమేష్‌గౌడ్, నాయకులు ఎడ్ల మల్లారెడ్డి, కొలెపాక సాంబయ్య, శంకరయ్య, మేకల భిక్షపతి, మైస భిక్షపతి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో మూడు మండలాల లబ్ధిదారులకు..

చిట్యాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అందజేశారు. మూడు మండలాలకు చెందిన 65 మంది లబ్ధిదారులకు రూ.21లక్ష విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. పార్టీ చిట్యాల మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ రఫీ, జిల్లా నాయకులు దోడ్డి కిష్టయ్య, సంపత్, కుమారస్వామి, రవి, శ్రీనివాస్, కొమరయ్య పాల్గొన్నారు.

మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : బీజేపీ



ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ పథకాలను వివరిస్తున్న నాయకులు

ములుగు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మార్పు రావాలంటే తమ పార్టీ అధికారంలోకి రావాలనే నినాదంతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్ గెలిచాక ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ మండలం అధ్యక్షుడు రాయంచు నాగరాజు విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ ఆదివారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం ద్వారా బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు. గ్రామీణ అభివృద్ధి, యువత, మహిళా సాధికారత, వ్యవసాయ అభివృద్ధి తదితర అంశాలపై ప్రజలకు ప్రత్యేకంగా వివరిసున్నామని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో మార్పు రాలేదని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జవహర్‌లాల్, నాయకులు రవీంద్రాచారి, రమేష్, విశ్వనాథ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణ

అమరగాని సూర్యనారాయణ, కాటారం డీఎస్పీ



ఫేస్‌టుఫేస్

ప్రశ్న: శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: డ్రగ్స్, గంజాయి నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. ఎక్సైజ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ నాటుసారా కట్టడి చేస్తున్నాం. ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణ చేస్తున్నాం.

ప్రశ్న: నేరాల నియంత్రణకు మీరు చేస్తున్న కృషి?

జవాబు: ప్రధాన రహదారుల పక్కన ఉన్న గ్రామాలు, పెద్ద ఊళ్లల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయిస్తున్నాం. పల్లెల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: సైబర్‌క్రైమ్‌పై చేపడుతున్న చర్యలేమిటి ?

జవాబు: డిజిటలైజేషన్ ప్రక్రియ అయినందున ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండేలా సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: మావోయిస్టుల కదలికలున్నాయా?

జవాబు: సబ్ డివిజన్‌లో మావోయిస్టుల ఉనికి లేదు. సరిహద్దు రాష్ట్రాలు ఉండటంతో ఎస్పీ, అడిషనల్ ఎస్పీ సూచనల మేరకు నిరంతరం అప్రమత్తంగా ఉండి పకడ్బందీగా నిఘా పెడుతున్నాం.

ప్రశ్న: ప్రమాదాలు నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నాం. ఇటీవల సబ్ డివిజన్ పరిధిలోని 8 మందికి డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జైలు శిక్ష కూడా పడింది. సీఐలు, ఎస్సైలు నిత్యం వాహనాల తనిఖీ చేపడుతున్నారు.

ప్రశ్న: అక్రమ దందాలపై తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: అక్రమదందాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి పనులు, ఇళ్ల నిర్మాణాలకు కాకుండా ఇసుక, మట్టి అక్రమ రవాణా చేసేవారిపై చర్యలు చేపట్టి కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం.

- కాటారం (ఆంధ్రజ్యోతి)

అలుపెరుగని బాటసారి



ఒంటి చేయి, ఒంటి కాలుతో సైకిల్ రైడ్ చేస్తున్న యువకుడు

వాజేడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అన్ని అవయవాలు సక్రమంగా ఉండి సొంత పనులు చేసుకోవడానికి చాలామంది బద్ధకిస్తుంటారు. అలాంటిది ఓ యువకుడు కాలు, చేయి లేకపోయినా దృఢసంకల్పంతో ఇండియా మొత్తం సైకిల్ రైడ్‌కు బయల్దేరాడు. ఝార్ఖండ్‌కు చెందిన సజుల్ తుడూ అనే యువకుడు ఒంటి చేత్తో, ఒంటికాలుతో సైకిల్ రైడ్ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇప్పటికే ఆరు వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సజుల్ జార్ఖండ్, వెస్ట్‌బెంగాల్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా తన ప్రయాణాన్ని సాగిస్తున్నాడు. ఇంట్లోంచి బయటకు వచ్చినప్పుడు తన వద్ద ఒక్క రూపాయి కూడా లేదని, మార్గమధ్యలో తన రైడ్‌ను చూసినవాళ్లు ఎంతో కొంత సాయం చేస్తూ తనను ప్రోత్సహిస్తున్నారని తెలిపాడు. అన్ని అవయావాలు ఉన్నవారు తనను చూసి ఎంతో కొంత మార్పు చెందుతారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపాడు. ఓ ప్రమాదంలో తన కాలు, చేయిని కోల్పోయానని, కుంగిపోకుండా పట్టుదలతో సైకిల్ రైడ్‌ను ప్రారంభించినట్లు తెలిపాడు. సజుల్ ప్రయత్నానికి నిజంగా సలాం కొట్టాల్సిందే. ఆదివారం వాజేడు మండలంలోని మండపాక వద్దకు చేరుకోగా ఆంధ్రజ్యోతి పలకరించింది.

అభివృద్ధి వైపు అడుగులు

(5వ పేజీ తరువాయి)

భూసేకరణ పనులను పూర్తి చేయనున్నారు.

పట్టణ విస్తరణకు నాంది

భూపాలపల్లి పట్టణం మీదుగా బైపాస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పలు గ్రామాలకు మహార్దశ పట్టనుంది. బైపాస్ చాలా వరకు పట్టణం వెలుపల నుంచి వెళ్లే అవకాశం ఉండటంతో పట్టణ విస్తరణకు ఇదొక సదవకాశంగా మారనుంది. ప్రస్తుతం భూపాలపల్లి నుంచి చెల్పూర్ వరకు విస్తరణ జరుగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో బైపాస్ వరకు పట్టణం పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇదే క్రమంలో ఈ రోడ్డు నిర్మాణం జరగనున్న గ్రామాల్లో భూముల ధరలు పెరిగాయి.

గూడెప్పాడ్ నుంచి చెల్పూర్ వరకు ఎన్‌హెచ్

గూడెప్పాడ్ నుంచి చెల్పూర్ వరకు నేషనల్ హైవే 353(సీ)ని నాలుగు వరసలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం అనుమతులు వచ్చాయి. దీంతో దాదాపు 44 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు 8 కిలోమీటర్ల మేర భూసేకరణ కోసం రూ. 600కోట్లను కేంద్రం కేటాయించింది. గూడెప్పాడ్ నుంచి పరకాల మీదుగా చెల్పూర్ వరకు నాలుగు వరసల రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ఇదే రోడ్డును భూపాలపల్లి బైపాస్‌కు అనుసంధానం చేయనున్నారు.